
మినీకథ

# కనువిప్పు

—ఇలపావులూరి శేషతల్పశాయి

ఓ గవర్నమెంట్ గుమస్తాగా పని చేస్తున్నాడు సన్యాసిరావు. ఆయన భార్య పంకజం. ఇద్దరూ తిండి విషయంలో ఎడ మొఖం పెడ మొఖంగా వుంటారు. సన్యాసిరావు భోజన ప్రియుడు. ఏదో ఒకటి చేసుకుని తినాలనే తపన ఎక్కువ. జాగ్రత్తగా ఎక్కువ ఖర్చు పెట్టకుండా, వృధా చేయకుండా ఉండాలనే మనిషి పంకజం.



ప్రతి ఆది వారం పప్పు, కూరలతోపాటు పాయసం, పూరీలు, పులిహోరల వంటి వంట కాలు చేయమని పంకజాన్ని బతిమాలాడు సన్యాసిరావు. కానీ పంకజం మాత్రం నిజంగా 'బంకజం.' అందుకే ఓ షరతు విధించింది. ఒక్కో ఆది వారం ఏదో ఒక రకం స్పెషల్ అనుమతిస్తున్నానని చెప్పింది. సన్యాసిరావు ఆనందం పట్టలేక పోయాడు. ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను అంగీకరిస్తే వారెంత సంతోష. పడతారో అలా సంతోష పడ్డాడు సన్యాసిరావు. తర్వాత ప్రశాంతంగా చెప్పింది. " ఆ స్పెషల్ కూడా మీరే చెయ్యాలని,అదీ పరిమితంగానే" అని. చేసేది లేక సరే అన్నాడు సన్యాసిరావు. ఓ ఆది వారం తనే పాయసం చేశాడు." చాలా బాగుంది" అంటూ సంతోషంగా భుజించాక అనవసరంగా ఎంత డబ్బు వృధా చేశారు. అంటూ గొణిగింది పంకజం. చిర్రెత్తుకొచ్చింది సన్యాసిరావుకి. తర్వాత ఆదివారం ఒక ప్లాను వేశాడు. ఎలాగూ తనే వండు తున్నాడు కాబట్టి ఈ వస పెట్టే భార్యను పుట్టింటికి పంపిస్తే తానే అన్ని రకాల వంటలను కావలసిన మేర చేసుకొని ఆనందంగా తిన వచ్చు అనుకున్నాడు. ఓ శని వారం సాత్రం వాళ్ల నాన్న గారు ఫోను చేసి రమ్మని చెప్పారని, తనకు తీరిక లేదని వెళ్ళమని పంపేశాడు పంకజాన్ని. ఆది వారం ఉదయం లేచి పప్పు కూరలు,. పాయసం, పూరీలతో పాటు, అప్పడాలు కూడా చేశాడు. ఆనందంగా ఆతృతతో భోజనం చేద్దామని కూర్చున్నాడు. ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. భార్య వచ్చిందేమోనని భయ పడుతూ వెళ్లి చూశాడు. ఎదురుగా ఓ ముష్టివాడు కనిపించాడు. కోపం పట్టలేక పోయాడు. "అయ్యా ఆకలిగా వుంది. కొంచెం అన్నం పెట్టండి బాబయ్యా అంటూ ఆర్తిగా అడిగాడు." ఇంట్లో ఆడవాళ్లు లేరు, వెళ్లు వెళ్లు, అయినా వేళా పాళా లేదా?" అని కసురుకుంటూ తలుపేసుకొని లోపలికి వెళ్లాడు. మరలా కూర్చొని వడ్డించుకోసాగాడు. ఇంతలో మరలా కాలింగ్ బెల్ మోగింది.మరలా ముష్టి వాడేమోనని గబ గబా వెళ్లి తలుపులు తీసి చూశాడు. ఎదురుగా పక్కింటి వనజాక్షి. " అన్నయ్యగారూ, పంకజం వూరెళ్లింది గదా! కూరలు మీకూ చేశాను. తీసుకోండి." అంటూ బాక్సు ఇచ్చింది. తీసుకొని, సందిస్తే లోపలికి వస్తుందేమోనని చటుక్కున తలుపేసుకున్నాడు. తినటం మొదలు పెట్టాడు. ఒక్కొక్కటి అన్నీ తినే సరికి బాగా ఎక్కువై పోయింది.వనజాక్షి ఇచ్చిన బాక్సు గుర్తొచ్చి తీసి చూశాడు. తనకు ఇష్టమైన గుత్తి వంకాయ కూర, మామిడికాయ పప్పు, వాటిని చూసే సరికి ఆగలేక గబ గబా తినేశాడు. చాలా తృప్తిగా వుంది. సంతోషంగా పైకి లేద్దామనుకున్నాడు. లేవ లేక పోయాడు బలవంతంగా లేచి పడుకున్నాడు. ఆయాసం మొదలైంది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఎప్పుడో ఓ స్నేహితుడు చెప్పినట్లు గుర్తు. అన్నం తిన్న తర్వాత కొంచెం దూరం నడిస్తే త్వరగా అరుగుతుందని నడిచే ఓపిక లేక పోయినా చిన్నగా మొదలు పెట్టాడు. కొంచెం దూరం నడిచే సరికే గగనమై పోయింది. ఆయాసం ఎక్కువైంది. ఓ చెట్టు కింద కూర్చొని రొప్పు తున్నాడు. ఇంతలో వనజాక్షి భర్త బజారు నుంచి వస్తూ గమనించాడు సన్యాసిరావుని." ఇక్కడేం చేస్తున్నారండీ ' ' అని అడిగాడు. జరిగినదంతా రొప్పుతూనే వివరించాడు సన్యాసిరావు.తన స్కూటరు పై ఎక్కించుకొని దగ్గరలో వున్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లాడు సన్యాసిరావుని. డాక్టరు అతణ్ణి చూసి" ఆయాసం వున్న వాళ్లు ఎక్కువగా తిన కూడదని" మందలించి ఓ ఇంజెక్షన్ చేసి, ఏదో మాత్రలు ఇచ్చి కాసేపు పడుకోమన్నాడు. ఇంతలో పది మంది జనం హడావుడిగా ఒక మనిషిని ఎత్తుకు వచ్చారు." డాక్టరుగారూ, ఇతను స్పృహ కోల్పోయాడు. చూడండి." అన్నాడు ఒకతను. డాక్టరు గబ గబా వెళ్లి అతణ్ణి చూసి ఓ సెలైను ఎక్కించి పర్లేదన్నారు. చూస్తూ నిలుచున్నారు అక్కడి వారంతా.

సన్యాసిరావు దగ్గరగా వెళ్లి చూశాడు. అతను తనింటికి వచ్చిన ముష్టివాడు. ఇంతలో అక్కడున్న వాళ్లు ఇలా అంటున్నారు. " ఆకలి, ఆకలి, అంటూ రోడ్డుపై పడి వున్నాడని, అన్నం తీసుకొచ్చే సరికి స్పృహ కోల్పోయాడని." సన్యాసిరావు దిగ్భ్రాంతి చెందాడు. అలాగే చూస్తూ ఉండి పోయాడు. తను కొంత దానం చేసి వుంటే తనకు అగతి పట్టి వుండేది కాదని, అతను ఇలా అయి వుండే వాడు కాదు కదా– అని తనలో తానే కుమిలి పోయాడు సన్యాసిరావు. ●